

'రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి'

అక్కన్నపేట, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ప్రభుత్వం రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురాములు మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం అక్కన్నపేటలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టి ఏబీసీడీలుగా విభజించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎ స్పీ మండల కమిటీలను ఎన్నుకున్నారు.

అధిక వడ్డీ పేరిట పెట్టుబడుల సేకరణ

- బోర్డు తిప్పేసిన బీ-4 బ్లాక్ స్వాన్ సంస్థ!
- గజ్వేల్, సిరిసిల్ల, కామారెడ్డి, కరీంనగర్, హైదరాబాద్‌లో బాధితులు

గజ్వేల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థలో పెట్టుబడులు పెడితే అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి బోర్డు తిప్పేసిన ఘటన తాజాగా వెలుగుచూసింది. పలువురు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బీ-4 బ్లాక్ స్వాన్ సంస్థ పేరుతో గజ్వేల్, సిరిసిల్ల, హైదరాబాద్, కరీంనగర్, కామారెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల్లో కోట్లాది రూపాయల పెట్టుబడులు సేకరించారు. సిరిసిల్లలో హోటల్ కమ్ బాంకెట్‌హాల్, కరీంనగర్‌లో హోటల్, గజ్వేల్‌లో హోటళ్లతోపాటు మెడికల్ షాప్‌లు, సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో హోటళ్లను ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి బీ-4 బ్లాక్ స్వాన్ గ్రూప్ పేరుతో రూ.లక్ష మొదలుకొని రూ.కోటి వరకు పెట్టుబడులు సేకరించారు. రెండేళ్లలో పలువురి పెట్టుబడులకు వడ్డీ రూపంలో రూ.లక్షకు నెలకు రూ.3 నుంచి 4 వేలు ఇచ్చారు. తాజాగా సంస్థ ప్రతినిధులు బోర్డు తిప్పేశారు. దీంతో పెట్టుబడులు పెట్టిన బాధితులు లబోదిబోమంటున్నారు. దాదాపుగా రూ.15 కోట్ల పైచిలుకు వసూలు చేసినట్టు తెలిసింది. దీంతో పలువురు బాధితులు హైదరాబాద్‌లోని ఆర్థిక నేరాల విభాగంలో సోమవారం ఫిర్యాదు చేశారు. సిరిసిల్ల, పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే కేసు నమోదైనట్లు సమాచారం. గజ్వేల్ పట్టణంలో ప్రజలు దాదాపుగా రూ.5 కోట్లు.. సిరిసిల్ల, కరీంనగర్, కామారెడ్డి, హైదరాబాద్‌లో దాదాపు మరో రూ.10 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టుబడి పెట్టినట్టు తెలుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన లక్ష్మీకాంత్ బీఫార్మసీ పూర్తి చేశాక గజ్వేల్ పట్టణంలో నివాసం ఉన్నారు. కొద్ది రోజులకు ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చారు. రెండేళ్ల క్రితం బీ-4 బ్లాక్‌స్వాన్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. తనకు పరిచయం ఉన్న వ్యక్తులకు బిజినెస్ ఐడియాలను వివరించారు. లక్ష్మీకాంత్ మాటలు నమ్మిన వారు పెట్టుబడి పెట్టడంతో పాటు పలువురితో పెట్టుబడులు పెట్టించారు. అయితే వారం రోజులుగా బీ-4 బ్లాక్ స్వాన్ గ్రూప్ హోటళ్లు, మెడికల్ షాపులు మూసి ఉండటంతో అనుమానం వచ్చి ఆయనకు ఫోన్ చేయడంతో స్విచ్ఛాఫ్ వస్తోందని బాధితులు చెబుతున్నారు. దీంతో వారు ఆందోళన చెంది పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేస్తున్నారు.

అట్టహాసంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



సంగారెడ్డిలో జరిగిన సోనియాగాంధీ జన్మదిన సంబరాల్లో పోతరాజులతో కలిసి చిందేస్తున్న జగ్గారెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న పోచమ్మలోళ్ల మహిళలతో జగ్గారెడ్డి

'సమగ్ర శిక్షా' ఉద్యోగుల సమ్మెబాట

- అరకొర వేతనాలతో అవస్థలు
- పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నుంచి స్పందన కరువు
- హామీలను నెరవేర్చాలని మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు
- నేటి నుంచి నిరవధిక సమ్మె

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులర్ పేస్కేల్ ఇవ్వాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులు బీఆర్ఎస్ హయాం నుంచి డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించి వారికి తగిన న్యాయం చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాయకులు హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పలుమార్లు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఏడాది దాటినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం, నవంబరు 15న ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఉద్యోగులు పోరుబాట సిద్ధమయ్యారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

జిల్లాలో 874 మంది ఉద్యోగులు

సమగ్ర శిక్షాలోని 12 విభాగాల్లో జిల్లావ్యాప్తంగా సుమారు 874 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరిని నిరసిస్తూ ఈ నెల 6నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరాహార దీక్షలు చేస్తున్నారు. 50 శాతం మంది ఉద్యోగులు రోజువారీ రిలే నిరాహార దీక్షల్లో, మరో 50 శాతం మంది ఉద్యోగులు ప్రభుత్వ కార్యకలాపాలకు ఇబ్బందులు కలగకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎంతకూ ప్రభుత్వం స్పం దించకపోవడంతో నేటి నుంచి పూర్తిస్థాయిలో పెన్‌డౌన్ చేసి నిరవధిక సమ్మెకు దిగుతామని ఉద్యోగులు తేల్చి చెబుతున్నారు. గురుకుల పాఠశాలలకు సంబంధించి కేజీబీవీలో విద్యార్థులకు విద్యాబోధనను ఆపేస్తామని, మిగతా పనులకు ఇబ్బందులు తలెత్తకుండా పార్ట్‌టైం సిబ్బంది అందుబాటులో ఉంటారని ఉద్యోగులు చెబుతున్నారు. వీలైనంత త్వరగా ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నారు

ఉద్యోగుల డిమాండ్‌లు

- సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. అప్పటివరకు పేస్కేల్ కల్పించాలి
- ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు రూ.ఆరోగ్య బీమా 10 లక్షల సౌకర్యం కల్పించాలి. ఉద్యోగ విరమణ పొందిన బెనిఫిట్స్ కింద రూ.25లక్షలు ఇవ్వాలి.
- ప్రభుత్వ మరియు విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలి. పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలి.

మిగతా 8వ పేజీలో...



సీఎం కప్ ట్రోఫీలో క్రీడాకారులు పాల్గొనాలి

- సిద్దిపేట మున్సిపల్ కమిషనర్

సిద్దిపేటటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ ట్రోఫీ పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పురుషులు, స్త్రీల విభాగంలో ఆసక్తి గల క్రీడాకారులు నేడు సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటల్లోపు తమ పేరును నమోదు చేసుకోవాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ తెలిపారు. సోమవారం సిద్దిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో సీఎం కప్ ట్రోఫీ నిర్వహణకు సంబంధించి పీడీలు సలీం, రాజప్రభాకర్, సుజాత, రాజ్‌మోహన్‌తో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. కబడ్డీ పోటీలకు సీనియర్ విభాగంలో పురుషులు 85 కేజీల లోపు, మహిళలు 75 కేజీల లోపు బరువు ఉన్న గల క్రీడాకారులు అర్హులని, వయస్సు నిబంధన లేదని చెప్పారు. ఖోఖో క్రీడలను సీనియర్ విభాగంలో వయస్సుతో సంబంధం లేకుండా ఆడవచ్చని చెప్పారు. వాలీబాల్ జూనియర్ విభాగంలో జనవరి 01, 2007లోపు పుట్టిన వారై ఉండాలని వివరించారు. వివరాలకు 9440231033 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

19న ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్‌లో భాగంగా సిద్దిపేట జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు 19న నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీవైఎస్‌వో జయదేవ్ ఆర్యా, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ అక్బర్ నవాబ్ తెలిపారు. ఫుట్‌బాల్‌పై ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డు, ఎస్ఎస్‌సీ మెమో తీసుకురావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులకు వారం పాటు ప్రత్యేక కోచింగ్ ఇస్తామని, ఆతర్వాత 27న హైదరాబాద్‌లోని జింఖానా స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గద్దర్ ప్రజా మహాసభకు తరలిరావాలి

- ప్రజా సంఘాల నేతల పిలుపు



గద్దర్ ప్రజా మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నేతలు

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఈనెల 15న సిద్దిపేట విపంచి కళానిలయంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజామహాసభ నిర్వహించనున్నట్లు వివిధ సంఘాల నేతలు తెలిపారు. సోమవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జేఏసీ చైర్మన్ డాక్టర్ జి.పాపయ్య, గద్దర్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి, కవి, గాయకులు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి మాజీ చైర్మన్ రసమయి బాలకిషన్, గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి, గద్దర్ కుమారుడు జి.వి.సూర్యకిరణ్, తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభలో గద్దర్ రాసిన పాటల జీవకణం, తరగని గని, లష్కర్, అండర్ గ్రౌండ్ పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ఈ మహాసభను ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు, ప్రజా సంఘాలు దళిత, బహుజన సంఘాలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గద్దర్ ఫౌండేషన్ సభ్యులు, సీనియర్ జర్నలిస్టు శ్రీరాములు, డీటీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు రంగాచారి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యాయ సంఘాల నేతలు తిరుపతిరెడ్డి, సత్తయ్య, లక్ష్మణ్, రచయిత, కవి భీమసేన, ఆల్ ఇండియా యాదవ మహాసభ నేత శ్రీహరి పాల్గొన్నారు.



కేంద్ర రైల్వేమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు

చిన్నకోడూరులో రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేయాలి

- కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కోరిన బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు

చిన్నకోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్‌లో భాగంగా సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేష్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, దామోదర్‌రావు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌ను కోరారు. ఇప్పటికే సిద్దిపేట వరకు రైలుసేవలు నడుస్తుండగా, సిద్దిపేట నుంచి కొత్తపల్లి వైపు రైల్వే నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చిన్నకోడూరులో రైల్వేస్టేషన్ చేయించాలని ఆ ప్రాంత ప్రజలు మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు విన్నవించారు. హరీశ్‌రావు ఆ విషయాన్ని బీఆర్ఎస్ ఎంపీల దృష్టికి తీసుకెళ్లారు. వారు ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చిన్నకోడూరు ప్రాంతంలో గొప్ప పర్యాటక ప్రాంతమైన రంగనాయకసాగర్ రిజర్వాయర్‌తో పాటు, ఇతర అభివృద్ధి ప్రాంతాలున్నాయని మంత్రికి వివరించారు. ప్రజలకు ప్రయాణం, వ్యాపార నిమిత్తం కరీంనగర్, హైదరాబాద్ పట్టణాలకు రాకపోకలు సాగిస్తారని, చిన్నకోడూరులో రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేస్తే ఎంతో మేలు చేకూరుతుందని ఎంపీలు విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీలకు మాజీ మంత్రి హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.



నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో మహా రుద్రహోమం

వర్గల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండో యాదాద్రిగా పేరొందిన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ప్రభుత్వం దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజావిజయోత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం క్షేత్రంలో ఆలయ వేదపండితులు మహా రుద్రహోమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలతో పాటు మహా రుద్రహోమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు భక్తులు అధికంగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయాధికారులు ఏర్పాటు చేశారు.

రసాభాసగా ఇందిరమ్మ కమిటీ సమావేశం



దుబ్బాకలో నిర్వహించిన ఇందిరమ్మ కమిటీ సమావేశంలో వాగ్వాదం

దుబ్బాక, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాకలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మరోసారి వాగ్వాదం చోటుచేసుకున్నది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కమిటీల సమావేశం రసాభాసగా మారింది. దుబ్బాకలోని 20 వార్డులోని ఇందిరమ్మ కమిటీ సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో అక్రమాలు జరిగాయంటూ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో కేటాయింపులు జరగలేదని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికేతరులకు కేటాయించారన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లకు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. కాంగ్రెస్ కార్యకర్తలు, కమిటీ సభ్యులు నిరసనగా సమావేశాన్ని బహిష్కరించారు. సమావేశం రసాభాసగా మారడంతో వాయిదా వేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ సుగుణబాలకిషన్‌గౌడ్, పల్లె మీనా, దేవుని లలిత, ఆస యాదగిరి, ఇల్లెందుల శ్రీనివాస్, ఆస స్వామి, కాంగ్రెస్ నాయకులు మచ్చశ్రీనివాస్, అనంతుల శ్రీనివాస్, బాల్‌రెడ్డి, ఆకుల భరత్ పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్

దౌల్తాబాద్/రాయపోల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్, పంచాయతీ ఎన్నికల దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రభాకర్‌రావు, జూనియార్ అసిస్టెంట్ రాజేశ్వర్, ఆపరేటర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే రాయపోల్ తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని ఎన్నికలకు సంబంధించిన ఫారం 6, 7, 8 దరఖాస్తుల పరిశీలన, మోడల్ ఇందిరమ్మ భవనం, అంగన్‌వడీడీ భవన నిర్మాణ స్థల సేకరణ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దివ్య, ఆర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో ఐఐటీహెచ్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

- వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి



6

రైతులను వ్యాపారవేత్తలను చేయడమే లక్ష్యం

- కృషి కల్ప ఫౌండేషన్ కృషి
- అధునాతన పద్ధతులు పాటించాలి
- కలెక్టర్ మనుచౌదరి



6

జోరుగా అక్రమ లేఅవుట్లు

- అనుమతులు లేకుండానే విక్రయాలు
- నష్టపోతున్న కొనుగోలుదారులు



8

శ్రీరాములపల్లిలో ప్రజాపాలన విజయోత్సవాలు

కోహెడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాములపల్లి గ్రామంలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ చేనేత కార్మికుల సహకార సమాఖ్య ఓఎస్డీ హిమాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. నేతన్న చేయూత పథకం కింద రూ.39 లక్షల చెక్కును కార్మికులకు అందజేశారు. మండలంలోని తంగళ్లపల్లి, హుస్నాబాద్ మండలంలోని పొట్లపల్లి గ్రామాలకు చెందిన చేనేత కార్మికులు పాల్గొన్నారు.


చేనేత కార్మికునికి చెక్కు అందజేస్తున్న అధికారులు

పెళ్లి కావడం లేదని మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


సంగు భాస్కర్ (ఫైల్)

నంగునూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వయసు మీరుతున్న పెళ్లి కావడం లేదని మనస్తాపనికి గురై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించి రాజగోపాలపేట ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. నంగునూరు సిద్ధన్నపేట గ్రామానికి చెందిన సంగు భాస్కర్(36) కారు డ్రైవింగ్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. తనకు పెళ్లి కావట్లేదని మనస్తాపంతో బాధపడే వాడు. ఆదివారం కారు డ్రైవింగ్‌కి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తండ్రి అంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజావాణికి 127 ఫిర్యాదులు

- సంగారెడ్డి జిల్లాలో 74 అర్జీలు.. స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి
- మెదక్ జిల్లాలో 53 దరఖాస్తులు రాగా, అర్జీలు తీసుకున్న అదనపు కలెక్టర్ నగేష్


సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి, మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 127 ఫిర్యాదులు అందాయి. సంగారెడ్డిలో 74 దరఖాస్తులు రాగా, మెదక్‌లో 53 వచ్చాయి. సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమిచ్చి సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. మెదక్‌లో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావుతో కలిసి వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధరణిపై 23, డబుల్ బెడ్‌రూం 6, పింఛన్లు 2, ఇతర సమస్యలపై 22 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. ప్రతీ ఒక్క దరఖాస్తుపై


వినతులను స్వీకరిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ నగేష్

స్పందించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి రోజు 10:15 నిమిషాలకు హాజరు రిజిస్టర్‌లో సంతకం చేయాలని, అధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సంగారెడ్డి ప్రజావాణిలోని అర్జీలు..

● పౌతి మార్పుల కోసం మూడేళ్లగా తిప్పుకుంటున్నారు కానీ, చేయడంలేదని సంగారెడ్డి జిల్లా కంది మండలం కలివెముల గ్రామానికి చెందిన వృద్ధురాలు తలారి సంగమ్మ అర్జీని అందజేశారు. తన భర్త తలారి సంగయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన పేరున ఉన్న వ్యవసాయ భూమిని తన పేరున పౌతి మార్పులు చేయాలని మండల తహసీల్దార్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని వాపోయారు. తనకు నడచేందకు కూడా ఇబ్బంది అవుతున్నా, ఇతరుల సహాయంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నానని, కలెక్టరమ్మ దగ్గరికి వెళితే, పని జరుగుతుందని తెలిసి ఇక్కడి వచ్చానని వృద్ధురాలు కన్నీరుమున్నీరైంది. తనకు పౌతి మార్పులు చేసి న్యాయం చేయాలని దీనంగా వేడుకున్నది.

● తన పొలంలో పైపులైన్ వేసుకోకుండా కొందరు పెత్తందారులు అడ్డుకుంటున్నారని అందోల్ మండలం రోళ్లపహాడ్ గ్రామానికి చెందిన గౌతాపురం బాలయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. పైపులైన్ వేసుకునేలా అనుమతినివ్వాలని కోరాడు.

రైతులను వ్యాపారవేత్తలను చేయడమే లక్ష్యం

- కృషి కల్ప ఫౌండేషన్ కృషి
- అధునాతన పద్ధతులను పాటించాలి
- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి


మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ముఖచిత్రాన్ని మార్చి రైతులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి కల్ప ఫౌండేషన్ కృషి చేస్తుందని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. సోమవారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో ఉద్యాన, వ్యవసాయ శాఖ సంయుక్తంగా కృషి కల్ప, జిల్లా యంత్రాంగం సహకారంతో నిర్వహించిన అగ్రిసినర్జీ-2024 కార్యక్రమానికి కలెక్టర్ మనుచౌదరి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 20కిపైగానే అగ్రిటెక్ స్టార్టప్‌ల ప్రదర్శన తిలకించారు. రైతులు, ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్) సీఈవోలు, డైరెక్టర్లు, విద్యార్థులతో మాట్లాడారు. నూతన వ్యవసాయ, ఉద్యాన పరిష్కారాల ప్రత్యక్ష ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, విజయగాథలు, మార్కెట్ లింకేజీ మార్గదర్శనలపై చర్చించి రైతులకు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను సరైన ధరకు అమ్ముకునేందుకు ఎఫ్‌పీవోల ద్వారా కృషి కల్ప ఫౌండేషన్ సహకరిస్తుందని అన్నారు. పెస్టిసైడ్లను అందించి వాటి వినియోగం, మార్కెట్‌లో డిమాండ్ ఉండి, దిగుబడినిచ్చే పంటలను ప్రోత్సహించి, సాగులో అధునాతన పద్ధతుల వినియోగంపై అవగాహన కల్పిస్తుందన్నారు. అక్కన్నపేట మండలంలో ప్రహర్ష, ప్రసిద్ధ ఎఫ్‌పీవోల ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నదని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి అధునాతన పద్ధతులు జిల్లాలోని రైతులకు ప్రయోజనకరంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆదర్శ రైతులు, ఎఫ్‌పీవోలు, విద్యార్థులు స్పష్టమైన అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. రైతులు బృందంగా ఏర్పడి ఎఫ్‌పీవోలుగా ఏర్పడాలని కోరారు. ప్రహర్ష, ప్రసిద్ధ ఎఫ్‌పీవోల ద్వారా సేకరించిన ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి సుముఖంగా ఉన్న అగ్రి కంపెనీలతో ఎంవోయూలను కుదిర్చారు. అనంతరం వివిధ సంస్థలు రైతులకు అందించే అవకాశాలను వివరించాయి. అనంతరం కలెక్టర్ కృషికల్ప ఫౌండేషన్ సీఈవో సీఎం పాటిల్‌తో కలసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను తికలకించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, వ్యవసాయ శాఖ అధికారి రాధిక, నాబార్డ్ డీడీయం నిఖిల్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.



స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి, స్టాల్‌లో పరికరాన్ని టెస్ట్ చేస్తున్న విద్యార్థులు

11, 12 తేదీల్లో ఐఐటీహెచ్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి


కందిలోని ఐఐటీ హైదరాబాద్

కంది, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ సాంకేతిక సమస్యలను పరిష్కరించడం కోసం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో వ్యవసాయం థీమ్‌పై స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 గ్రాండ్ ఫినాలే నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా 51 కేంద్రాల్లో జరగనున్న ఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు ఐఐటీహెచ్ హోస్ట్ చేస్తోంది. ఇందులో రైతులకు ప్రత్యక్ష మార్కెట్ యాక్సెస్ కోసం మొబైల్ యాప్, ఏఐ డ్రివెన్ క్రాప్ డిసీజ్ ప్రిడిక్షన్, అధిక దిగుబడి రావడానికి స్థిరమైన ఎరువుల వినియోగం, స్థిరమైన మార్కెట్ యాక్సెస్ కోసం కాంట్రాక్ట్ ఫార్మింగ్ తదితర అంశాలపై విద్యార్థులు ఆవిష్కరణలను రూపొందించనున్నారు. విద్య, పరిశ్రమల భవిష్యత్తు, వాస్తవ ప్రపంచ సవాళ్లను పరిష్కరించేందుకు విద్యార్థులను ప్రోత్సహించడమే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ లక్ష్యంగా పెట్టుకున్నదని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ మెంచు నగేష్

మెదక్ అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్ష నిర్వహణ సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షల కోసం జిల్లాలోని మెదక్‌లో 11, నర్సాపూర్‌లో 3, తూప్రాన్‌లో 2, మొత్తం 16 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మౌలిక సదుపాయాలైన తాగు నీరు, విద్యుత్, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, శానిటైజేషన్ వంటివి చేపట్టాలన్నారు. 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 5, రూట్ ఆఫీసర్స్ 5, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్ 16 మంది చొప్పున విధులు నిర్వహిస్తారన్నారు. 58 మంది పరిశీలకులు, 44 మంది బయోమెట్రిక్, ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. లోనికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా పేపర్ల భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ పేపర్-1 పరీక్ష జరగనుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు.. హిస్టరీ, పోలిటీ, సొసైటీ పేపర్ -2 పరీక్ష ఉంటుందన్నారు. 16న ఉదయం ఎకనామి, డెవలప్‌మెంట్ పేపర్-3, మధ్యాహ్నం తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ అంశంపై పేపర్-4 పరీక్షకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 5,855 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. బయోమెట్రిక్ హాజరు ఉంటుందని, సమాయానికి అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

స్కైవాక్ నుంచి దూకి.. సూసైడ్‌కి యత్నించి

ఉప్పల్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : ఉప్పల్ స్కైవాక్ నుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యయత్నానికి యత్నించిన ఘటన సోమవారం చోటుచేసుకున్నది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. సంగారెడ్డిలోని భవానీనగర్‌కు చెందిన ఎస్‌ఏ ఫ్రాన్సిస్(34) ఉప్పల్ స్కైవాక్ ఎక్కి ఎల్బీనగర్ బస్టాప్ వద్ద ట్రాఫిక్ బూత్‌పైకి దూకడంతో పోలీసులు స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. ఎడమకాలుకి గాయలయ్యాని ప్రాథమిక చికిత్స అనంతరం విచారించిన పోలీసులుకు కుటుంబకలహాలతో మతిస్థిమితం కోల్పోవడం జరిగిందని వెల్లడించారు.

సిబ్బంది లేక.. ఇబ్బంది..

అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో అధికారుల కొరత

- తొమ్మిదిన్నరేళ్లలో 18వ కమిషనర్
- 48 పోస్టులకు 24 మంది మాత్రమే
- 26 మంది సఫాయీ కార్మికులకు నలుగురే..
- ఇన్‌చార్జి ఆఫీసర్లతో కుంటుపడిన పాలన



అందోలు-జోగిపేట మున్సిపల్ కార్యాలయం

జోగిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అందోలు-జోగిపేట మున్సిపాలిటీ సిబ్బంది లేమితో కునారిల్లుతున్నది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుగా ఉంది ఇక్కడి పరిస్థితి. రూ.కోట్లాది నిధులున్నా... సరిపడా సిబ్బంది లేకపోవడంతో పాలన కుంటుపడుతున్నది. ప్రధానంగా పౌర సేవలకు తీవ్ర ఆటంటకం కలుగుతోంది. ఇక్కడ ఒక కమిషనర్ మినహా.. దాదాపు మిగతా కీలక సిబ్బంది డిప్యుటేషన్‌పై పనిచేయడం, లేదా ఇతర చోట్ల అదనపు బాధ్యతలు అప్పగించడంతో వారానికి ఒకట్రెండు సార్లు వచ్చిపోవడమో జరుగుతోంది. కమిషనర్ పోస్టుకు కూడా గత పదిహేను రోజుల వరకూ రెగ్యులర్ అధికారి లేకపోవడం గమనార్హం. కేవలం తొమ్మిదిన్నరేళ్లలో 17 మంది కమిషనర్లు మారగా.. ఇప్పుడున్నది 18వ కమిషనర్. ఇక్కడ మొత్తం 48 రెగ్యులర్ అధికారులు, సిబ్బంది పనిచేయాల్సి ఉండగా.. కేవలం 24 మంది మాత్రమే ఉన్నారు. అధికారులు, సిబ్బంది కొరతతో శానిటేషన్, టౌన్ ప్లానింగ్, నీటి సరఫరా తదితర విభాగాల పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది.

కీలక విభాగాల్లోనూ...

మున్సిపాలిటీకి అత్యంత ఆవశ్యకమైన ఏఈ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ అధికారి, సహాయకుడు (టీపీవో, టీపీఎ), అకౌంటెంట్ పోస్టులకు రెగ్యులర్ అధికారులు నియామకం కాలేదు. దీంతో ఇతర చోట్ల పనిచేసేవారికి ఇక్కడి బాధ్యతలు అదనంగా అప్పజెప్పడంతో వారంతా వారినికి ఒకట్రెండు సార్లు వచ్చిపోతున్నారు. సంగారెడ్డిలో పనిచేసే ఏఈకి అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో ఆయన ఏకకాలంలో రెండు మున్సిపాలిటీల్లో రూ. కోట్లాది నిధుల అభివృద్ధి పనులపై పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కూడా లేకపోవడంతో పర్యవేక్షణ కరువై అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడుతున్నది. ఇక శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేక.. ఆ బాధ్యతలను జూనియర్ అసిస్టెంట్‌కు అప్పజెప్పడంతో దాని నిర్వహణ సరిగాలేక పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య కార్మికుల పోస్టులదీ అదే పరిస్థితి. వాస్తవానికి ఈ మున్సిపాలిటీకి 26 సఫాయీ కార్మికుల రెగ్యులర్ పోస్టులు మంజూరుకాగా, కేవలం నలుగురే ఉన్నారు. దీంతో 29 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. ఇది మున్సిపాలిటీ ఆర్థికంగా భారంగా మారింది.

ఖజానాకు గండి..

సంగారెడ్డి మున్సిపాలిటీలో పనిచేసే టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. దీంతో ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇదే అదునుగా పైరవీకారులు రెచ్చిపోయి ప్రజల జేబులకు చిల్లులు పెడుతన్నారు. కొంతమంది దళారులు రంగప్రవేశం ఇండ్ల నిర్మాణానికి తొందరగా అనుమతులు ఇప్పిస్తామని దరఖాస్తుదారులను నమ్మిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమ నిర్మాణాలు సైతం పెద్దఎత్తున జరుగుతున్నాయి. మున్సిపాలిటీకి శ్వాసలాంటి రెవెన్యూ విభాగానిది ఇదే దారి. వాణిజ్య, వ్యాపార ట్రేడ్ లైసెన్సులు, ఇంటి, దుకాణాల పన్నుల విషయంలో కిందిస్థాయి సిబ్బందితో కుమ్మక్కవుతున్న కొందరు వ్యాపారులు తమ పన్నుల అసెస్‌మెంట్‌ను తగ్గించుకుంటున్నారు. దీంతో మున్సిపాలిటీ ఖజానాకు భారీగా గండిపడుతోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ రెగ్యులర్ అధికారులతో భర్తీ చేసి మెరుగైన సేవలందేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పనుల్లో కొంత జాప్యం..



మున్సిపాలిటీలో పలు ముఖ్యమైన పోస్టులు ఇంకా మంజూరుకాలేదు. ప్రజలకు ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతో ఇన్‌చార్జి అధికారులతో సేవలందిస్తున్నాం. వారికి ఇతర మున్సిపాలిటీల్లోనూ బాధ్యతలు ఉండడంతో పూర్తిస్థాయిలో పనులు జరగడంలో కొంత జాప్యం జరుగుతుంది. రెగ్యులర్ అధికారులను నియామకంతోనే ఈ సమస్య పరిష్కారమవుతుంది. రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు నలుగురే ఉండడంతో ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పారిశుధ్య పనులు చేపడుతున్నాం. దీంతో నెలకు రూ.4.35 లక్షలను మున్సిపల్ నిధుల నుంచి వారికి చెల్లించాల్సి వస్తోంది. ఇది మున్సిపాలిటీకి ఆర్థికంగా పెను భారమే.

-తిరుపతి, మున్సిపల్ కమిషనర్



ముస్తాబైన మల్లికార్జున స్వామి ఆలయం

నేటి నుంచి మల్లికార్జునస్వామి జాతర

కోహీర్, డిసెంబరు 9 : (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో ఈ నెల 10 నుంచి 17వ వరకు మల్లికార్జునస్వామి(పట్టి) జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆలయంలో భ్రమరాంబ, మల్లికార్జున, కేతమ్మ, లింగము, నంది, వినాయక విగ్రహాల పునఃప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ ఉదయం 8.15 గంటలకు హనుమాన్ మందిరం నుంచి విగ్రహాల ఊరేగింపు ఉంటుందని తెలిపారు. అలాగే 11న శాంతి పాఠం, గోమాత పూజ, అవాహిత దేవత పూజ. 12న ఉదయం 8 గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన, పీఠదేవతల హోమాలు, 14న గ్రామ దేవతలైన మైసమ్మ, ఊరడమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పణ, 15న మల్లికార్జున స్వామి కల్యాణం, అగ్నిగుండం ప్రవేశం, స్వామి వారికి అభిషేకం, గొలుసు తెంపుట, కుంకుమార్చన స్వామి వారి జీవిత చరిత్రపై ఒగ్గు కథ, రాత్రి 8గంటల నుంచి భజన కార్యక్రమంతో పాటు స్వామివారి రథోత్సవం, 16న కేతమ్మ, మల్లికార్జున స్వామి వేషధారణలో ఊరేగింపు, లగ్నం, సాయంత్రం 4.30కు రథోత్సవం, 17న సమ్మక్క జీవిత చరిత్ర బయలు నాటకం ఉంటుందన్నారు.

క్రైం కార్నర్

రెండు కార్లు ఢీ.. ఒకరి మృతి

● నలుగురికి గాయాలు

నర్సాపూర్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీ కొనడంతో ఒక వ్యక్తి మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం వనపర్తికి చెందిన అధ్యాపకుడు బింగి శ్రీకాంత్(30) తన నలుగురు స్నేహితులు శివరాములు, యాదగిరి, శివకృష్ణ, రాఘవేంద్రతో కలిసి ఏడుపాయల దేవస్థానం దర్శనానికి వచ్చారు. తిరుగుప్రయాణంలో నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని జలహనుమాన్ మలుపు రాగానే హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న ఇన్నోవా కారు వీరి కారును బలంగా ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా నలుగురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శ్రీకాంత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. ఇన్నోవా కారు డ్రైవర్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని మహిళ..



లక్ష్మి(ఫైల్)

చేగుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని మహిళ మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై అహ్మద్ మోహినోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన వట్టేపు లక్ష్మి (40) తన భర్త వట్టేపు నాగరాజుతో కలిసి నార్సింగి శివారులో ఉన్న తన వ్యవసాయ పొలం వద్దకు పనుల నిమిత్తం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి వారిని ఢీకొట్టగా లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్ర గాయాలపాలైన నాగరాజును స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో పడి ఉన్న వ్యక్తి

మిరుదొడ్డి, డిసెంబరు9 (ఆధ్రజ్యోతి) : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం చెప్యాల గ్రామానికి చెందిన యాదగిరి మిరుదొడ్డి నుంచి చెప్యాలకు, మిరుదొడ్డికి చెందిన కుమ్మరిరాజు అల్వాల నుంచి మిరుదొడ్డి ద్విచక్రవాహనాలపై వస్తుండగా ప్రమాదవశాత్తు రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు పోలీసులు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఎస్‌ఐ పరశురాములు అంబులెన్స్ ఆలస్యం అవుతుందనే కారణంతో క్షతగాత్రులను పోలీస్ వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటారు.

కల్వర్టును ఢీకొన్న కారు

చేర్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ శివారులోని ప్రమాదకర మూలమలుపు వద్ద కల్వర్టును సోమవారం ఉదయం ఓ కారు ఢీ కొన్న సంఘటనలో ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా కేంద్రానికి చెందిన జయకోటి రమేశ్‌తో పాటు మరోవ్యక్తి కారులో సిద్దిపేటకు వెళ్తున్నారు. మార్గమధ్యలో ముస్త్యాల శివారు మూలమలుపు వద్ద కారు అనుకోకుండా అదుపుతప్పడంతో కల్వర్టును ఢీ కొంది. దీంతో కారు అద్దాలు, ఇంజన్ ముందరి భాగం దెబ్బతినడంతో ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. కొద్దిరోజులక్రితం బచ్చన్నపేట మండలానికి చెందిన ఇరువురు ఇదే కల్వర్టు సమీపంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం మరిచిపోకముందే మరో ప్రమాదం సంభవించడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు

● ఎక్సైజ్ సీఐ పవన్



నాటు సారా రవాణా చేస్తున్న వ్యక్తిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

అక్కన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం రాత్రి అక్కన్నపేట మండలంలోని గండిపల్లి నుంచి రామవరం వెళ్లే దారిలో ఎక్సైజ్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై అక్రమంగా రవాణా చేస్తున్న 10 లీటర్ల నాటు సారాను పట్టుకున్నారు. గండిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని హేన్య తండాకు చెందిన ముడవత్ కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఎక్సైజ్ ఎస్‌ఐ దామోదర్ శెట్టి, కానిస్టేబుళ్లు సతీష్, గణేష్ ఉన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం మార్చడంపై మండిపాటు



మాట్లాడుతున్న ప్యాక్స్ వైస్ చైర్మన్ బాలరాజు

మర్కుక్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తల్లి విగ్రహ ఆకృతిని మార్చడంపై తెలంగాణ ఉద్యమకారుడు, జగదేవ్‌పూర్ ప్యాక్స్ వైస్ చైర్మన్ కమ్మరి బాలరాజు రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. తెలంగాణ చరిత్ర, ఖ్యాతిని అవమానపరిచే విదంగా ప్రస్తుత తెలంగాణ తల్లి ఆకృతి ఉందన్నారు. సోమవారం ఎర్రవెల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతమాత చిత్రాన్ని తలపించేలా తెలంగాణ తల్లికి రూపం ఇవ్వాలన్న కేసీఆర్ సూచన మేరకు ప్రొఫెసర్ గంగాధర్ నాడు ఆ రూపాన్ని ఇచ్చారన్నారు. మాజీ ఉపసర్పంచ్ కనకయ్య, యాదగిరి, మంకేశ్ సత్తయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులతో 50 ఏళ్ల స్వర్ణోత్సవాలు

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1974 బ్యాచ్ పూర్తయి 50 సంవత్సరాలు పూర్తయినందున కళాశాలలో స్వర్ణోత్సవాలు నిర్వహించనున్న స్వర్ణోత్సవ సంబరాల వేదిక కమిటీ సభ్యులు హరిశ్చంద్ర తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కమిటీ సభ్యులు అమ్మన చంద్రారెడ్డి, మహిపాల్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 20న సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియం ఈ సంబరాలకు వేదిక కానుందని తెలిపారు. ఈ స్వర్ణోత్సవాలు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరుగుతాయన్నారు. 1974లో డిగ్రీ పూర్తి చేసిన అన్ని బ్యాచ్‌ల, గ్రూపుల విద్యార్థులు ఈ సంబరాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 1974 లో సిద్దిపేటలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు చదువుకున్నారని, ఇప్పుడు ఎక్కడ ఉన్న సంబరాలలో పాల్గొనాలన్నారు. పూర్వ విద్యార్థులకు అధ్యాపకులకు ఈ సందర్భంగా సన్మానం చేస్తున్నామని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం కమిటీ సభ్యులను నేరుగా కానీ, ఫోన్ ద్వారా 9618195145 నంబర్ ను సంప్రదించాలని కోరారు.

బాలల హక్కులకు భంగం కలగకుండా చూడాలి

● జడ్పీ సీఈవో జానకీరెడ్డి

సంగారెడ్డి అర్బన్ /సంగారెడ్డి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కులకు భంగం కలిగించకుండా చూడాలని జడ్పీ సీఈవో జానకీరెడ్డి అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం బేటీ పడావో బేటీ బచావో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. బాలల హక్కుల చట్టాలను అమలు చేయడం అత్యంత ప్రాముఖ్యమని, పని ప్రదేశాల్లో లైంగిక వేదింపుల నివారణ, బాల్య వివాహాల నిరోధం, బాలల అక్రమ రవాణా లాంటి అంశాలపై సమాజాన్ని ఇంకా చైతన్యపరచాలన్నారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన అవసరమన్నారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, హెల్ప్‌లైన్ నంబర్లపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. బాల బాలికల సమాన హక్కులపై అవగాహన కల్పించి బాలల భవిష్యత్తును కాపాడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో స్వప్న, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, సూర్యకాంత్, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బేటీ పడావో బేటీ బచావో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ సీఈవో జానకీరెడ్డి

నేడు బైక్ వేలం

నారాయణఖేడ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 10న ఉదయం 11 గంటలకు సీజ్‌డ్ పల్సర్ బైక్‌లను వేలం వేయనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకనటలో తెలిపారు. ఎక్సైజ్ కేసులో సీజ్ చేసిన బజాజ్ పల్సర్ టీఎస్15ఈటీ3376ను ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు వేలం వేయనన్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం నారాయణఖేడ్ కార్యాలయాన్ని సంప్రదించాలని, నిర్ణిత సమయానికి నిబంధనల ప్రకారం వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

హవేళిఘణపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన జక్కన్నపేటలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బుర్క నర్సింహులు(47) సోమవారం తెల్లవారుజామున ఇంటి పక్కనే ఉన్న మురుగు కాలువలోకి మూత్ర విసర్జనకు వెళ్లగా ప్రమాదవశాత్తు అందులో బోర్లాపడి ఊపిరాడక మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎసై సత్యనారాయణ తెలిపారు.

క్రైం కార్నర్

నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

చేర్యాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండల కేంద్రంలోని పలు పాన్‌షాప్‌లు, దాసారంగుట్టతో పాటు అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు సోమవారం సాయంత్రం నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రాజు మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలు మిలితమైన చాక్‌లెట్లు విక్రయించినా, మత్తు పదార్థాలు వినియోగించినా చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరిపై కేసు

బెజ్జంకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాగిల్లాపూర్ శివారులోని రాజీవ్ రహదారిపై సోమవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మద్యం సేవించి పట్టుబడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే వాహనాల తనిఖీ చేపట్టి ఓవర్ లోడ్‌తో వెళ్తున్న లారీలకు జరిమానాలు విధించారు.

పేకాట స్థావరంపై దాడి

చిన్నకోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ బాలకృష్ణ వివరాల ప్రకారం మండలంలోని గోనెపల్లి గ్రామ శివారులోని ఓ హోటల్‌లో కొంతమంది కలిసి పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారంపై సోమవవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు సంయుక్తంగా దాడిచేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,964 నగదు, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా సాయినాథ్‌గౌడ్

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా సిద్దిపేట పట్టణానికి చెందిన కంచర్ల సాయినాథ్‌గౌడ్ నియామకమయ్యారు. ఆయనతో పాటు సిద్దిపేట అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్‌గా మడూరి విజయమోహన్ నియామకమయ్యారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షారెడ్డి నియామకపత్రాలను అందజేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ వెంకట్, పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు విగ్రహావిష్కరణ

హుస్నాబాద్‌రూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత నేత బొమ్మ వెంకటేశ్వర్లు స్మారక విగ్రహం హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డులో ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

భూమిని కాపాడుకుందాం

జగదేవ్‌పూర్: జీవకోటి మనుగడ కోసం భూమిని కాపాడుకుందామని ఎంఈవో మాధవరెడ్డి అన్నారు. తెలంగాణ బయోసైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం ఉన్నత పాఠశాల మునిగడపలో విద్యార్థులకు మండల స్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.

'జాగ్రత్తలు తీసుకోవాలి'

మర్కుక్: గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్త తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు రాణి, స్వప్న సూచించారు. మర్కుక్ మండలం చేబర్తి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు.

జోరుగా అక్రమ లే అవుట్లు



అక్కన్నపేట మండల కేంద్రంలో పంచాయతీ అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లు

- అనుమతులు లేకుండానే విక్రయాలు
- నష్టపోతున్న కొనుగోలుదారులు
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల దందా 'మూడు పువ్వులు ఆరు కాయలు'గా కొనసాగుతోంది. వ్యవసాయ భూములను ల్యాండ్ కన్వర్షన్, గ్రామపంచాయతీల అనుమతి లేకుండానే ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. మరికొంతమంది వ్యాపారులైతే వ్యవసాయ భూములను ల్యాండ్ కన్వర్షన్ చేసి జీపీ అనుమతి లేకుండానే అక్రమ లేఅవుట్లు పెట్టి ప్లాట్లు విక్రయిస్తున్నారు. దీంతో పంచాయతీ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. అక్కన్నపేట మండల కేంద్రంలోని బూరుగు మైసమ్మ ఆలయానికి వెళ్లేదారిలో నూతనంగా నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సమీపంలో ఓ ప్రైవేట్ వ్యక్తికి చెందిన రెండెకరాల వ్యవసాయ భూమిని అధికార పార్టీకి చెందిన ఓ నేత కొనుగోలు చేశాడు. ఆ నేత రెండు ఎకరాల భూమిని 35 నుంచి 40 ప్లాట్లుగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన పేరుతో పాటు మరో వ్యక్తిపై ల్యాండ్ కన్వర్షన్ (నాలా కన్వర్షన్) చేయించారు. కానీ గ్రామపంచాయతీ అనుమతులు తీసుకోకుండానే అక్రమంగా లే అవుట్లు పెట్టి ప్లాట్లు విక్రయిస్తున్నారు.

కొనుగోలుదారులకు ఇబ్బందులు

అనుమతులు లేకుండా ప్లాట్లు కొన్న కొంతమంది కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్థలాల్లో ఇంటి నిర్మాణానికి గ్రామపంచాయతీ అనుమతి ఇవ్వడం లేదని, ఇంటి నిర్మాణానికి రుణాలు కూడా అందడం లేదని వాపోతున్నారు. అంతేకాకుండా ల్యాండ్ కన్వర్షన్ (నాలా కన్వర్షన్) లేకుండా వ్యవసాయ భూముల్లో ప్లాట్లు కొన్నవారు కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. వీటిలో ఇళ్లు కట్టుకోవాలంటే పంచాయతీ అనుమతి ఇవ్వడం కుదరదు. అనుమతి లేకుండా నిర్మాణం చేసిన ఇళ్లకు ఇంటి నెంబర్లు ఇవ్వడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది అక్రమ లే అవుట్లు పెట్టి ప్లాట్లు విక్రయిస్తుండగా, మరికొంతమంది తమ వ్యవసాయ భూములను గుంట, రెండు గుంటలుగా ప్లాట్లు చేసి తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు.

నిబంధనలు ఇవి

వ్యవసాయ భూములను ఇళ్లస్థలాలుగా మార్చేందుకు ముందుగా ల్యాండ్ కన్వర్షన్ (నాలా కన్వర్షన్) చెయ్యాలి. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి నిబంధనల మేరకు చలానా కట్టాల్సి ఉంటుంది. వెంచర్లు ఏర్పాటు చేయాలంటే గ్రామపంచాయతీ పేరుపై 10 శాతం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలి. ఏర్పాటు చేసిన వెంచర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులే రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం, పార్కు, డ్రైనేజీ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. గ్రామపంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అయితే వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా చేసి విక్రయిన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పై లేఅవుట్లపై జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



అక్కన్నపేటలో ఏర్పాటుచేసిన వెంచర్‌కు గ్రామపంచాయతీ అనుమతులు లేవు. అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్ల వ్యాపారులకు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటాం. అనుమతులు తీసుకోకుంటే లేఅవుట్లను రద్దు చేస్తాం.

- జీ.లక్ష్మీకాంతారావు, పంచాయతీ కార్యదర్శి, అక్కన్నపేట

ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి



వ్యవసాయ భూములను ఇళ్ల స్థలాలుగా మార్చుకోవాలంటే తప్పనిసరిగా ల్యాండ్ కన్వెన్షన్ (నాలా కన్వర్షన్)చేయించుకోవాలి. ప్రభుత్వ నిబంధనలను పాటించాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం.

- అనంతరెడ్డి, తహసీల్దార్, అక్కన్నపేట

'సమగ్ర శిక్షా' ఉద్యోగుల సమ్మెబాట

5వ పేజీ తరువాయి..

- టీఎస్ఎస్ ఉద్యోగులందరికీ రిఎంగేజ్ విధానాన్ని తొలగించాలి.

ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి



విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అందరినీ రెగ్యులర్ చేసి అప్పటివరకు పేస్కేల్ వేతనం కల్పించాలి. సమస్యను పరిష్కరించేంతవరకు నిరంతర పోరాటాలు కొనసాగిస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

-మమత, స్పెషల్ ఆఫీసర్, కేజీబీవీ హుస్నాబాద్

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించం



15 రోజుల క్రితం సమ్మె నోటీసు ఇచ్చాం. మూడు రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. నేటి నుండి పూర్తిస్థాయిలో నిరవధిక సమ్మెకు దిగుతున్నాం. బోధనను పూర్తిస్థాయిలో బైకాట్ చేస్తాం. బోధనేతర పనులలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. అయినా కూడా ప్రభుత్వం స్పందించకపోతే మరోసారి చర్చించుకుని పోరాటాలను ఉధృతం చేస్తాం.

- కరుణాకర్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం స్పందించాలి



మా పోరాటాన్ని ప్రభుత్వం ఇప్పటికైనా గుర్తించి మా సమస్యలను పరిష్కరించి డిమాండ్లను నెరవేర్చాలి. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి విద్యారంగాన్ని కాపాడుతామని చెప్పిన ప్రభుత్వం విద్యారంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులు రోడ్డు ఎక్కిన పట్టించుకోకపోవడం బాధాకరం.

-సరిత, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకురాలు

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికను పకడ్బందీగా నిర్వహించాలి



గజ్వేల్‌లో వార్డు ఆఫీసర్లతో సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

గజ్వేల్/హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ఎంపికను పకడ్బందీగా నిర్వహించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి వార్డు ఆఫీసర్లకు సూచించారు. గజ్వేల్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డు ఆఫీసర్లకు ఇచ్చిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని, సర్వేకు వచ్చిన అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీ, కౌన్సిల్ సభ్యులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 7, 8వ వార్డులలో తడి, పొడి చెత్తపై ప్రజలకు రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నరసయ్యలు అవగాహన కల్పించారు. ఆయనవెంట వైస్ చైర్మన్ జకీయోద్దీన్, కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్, మునిసిపల్ సిబ్బంది ఉన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను పారదర్శంగా పరిశీలించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో 4,542 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దరఖాస్తుల పరిశీలన కోసం 26 మంది సర్వే ఆఫీసర్లను నియమించామన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు నళినిదేవి, రమాదేవి, స్వర్ణలత, భాగ్యారెడ్డి, పున్న లావణ్య, పద్మ, వేణు, శ్రీనివాస్, రాజు, కల్పన పాల్గొన్నారు.

కాగా హుస్నాబాద్ పట్టణంలో నాల్గవ వార్డులో ఇందిరమ్మ ఇడ్ల సర్వే ప్రక్రియను కమీషనర్ మల్లిఖార్జున్ సోమవారం పరిశీలించారు. వార్డు ఆఫీసర్లు చేపడుతున్న సర్వేను ఆయన స్వయంగా పరిశీలించారు. ఇళ్లు లేనివారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

ప్రతీ విద్యార్థికి చతుర్విద ప్రక్రియలు నేర్పించాలి: డీఈవో



విద్యార్థినితో పుస్తక పఠనం చేయిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మర్కుక్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థికి చతుర్విద ప్రక్రియలు కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగాహారాలు నేర్పించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం పాములపర్తి హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వెంకట్‌రాములుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించి బోర్డుపై తెలుగు, ఆంగ్ల పదాలు కూడి కలు, తీసివేతలు, గుణకార, బాగాహారాలు విద్యార్థులచే చేయించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్న ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులను అభినందించారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

చిన్నకోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని విద్యుత్‌శాఖ డీఈ రామచంద్రయ్య అన్నారు. మండలంలోని విఠలాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓవర్ లోడ్‌తో విఠలాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల రైతులు ఇబ్బందిపడ్డారని, 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో రైతులకు ఇబ్బంది ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈలు శ్రీనివాసులు, రవీంద్ర, అశోక్ బాబు, ఏఈలు చాంద్‌బాషా పాల్గొన్నారు.

క్రీడా మైదానాల పరిశీలన

జగదేవ్‌పూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం క్రీడా కప్-2024 మండల స్థాయి క్రీడా పోటీలు మండలంలోని జగదేవ్‌పూర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి యాదగిరి తెలిపారు. సోమవారం ప్రభుత్వ బాలుర పాఠశాలను ఎంఈఓ మాధవరెడ్డి, ఎస్‌ఐ చంద్రమోహన్, ఎంపీవో ఖాజా మోహినొద్దీన్‌తో కలిసి సందర్శించి క్రీడా పోటీలకు అనువైన మైదానాన్ని ఆయన పరిశీలించారు.

చిహ్నాలు, విగ్రహాలపై కాదు.. అభివృద్ధిపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం చిహ్నాలు, విగ్రహాలపై కాకుండా, అభివృద్ధిపై దృష్టి సారించాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు తెలిపారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. హైదరాబాద్‌లో శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలపై పోలీసులు ప్రవర్తించిన తీరు రాష్ట్ర మహిళలందరినీ బాధకు గురి చేసిందన్నారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో ఎప్పుడూ శాంతి భద్రతలకు విఘాతం కలగలేదని, మహిళలకు సముచిత స్థానం కల్పించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రంలో శాంతి భద్రతలు దిన దిన గండంగా మారాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆశావర్కర్ల వేతనాలు వెంటనే పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పట్టణ కౌన్సిలర్లు వంగ రేణుక, కొండం కవిత, వరాల కవిత, దాసరి భాగ్యలక్ష్మి, బింగి బాల్‌లక్ష్మి, అడ్డగట్ల కావేరిరేణుక, బంధారం శ్రీలత, తస్లీమ్ బేగం, గోపాలపురం దీప్తి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిది నిర్బంధ పాలన: 'వంటేరు'

గజ్వేల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్బంధన పాలనను అమలు చేస్తున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి రానివ్వకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ టీషర్ట్‌లపై అదాని బొమ్మలతో వెళ్తే లేని తప్పు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అదాని బొమ్మలతో వెళ్తే తప్పేంటని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చి కాంగ్రెస్ తల్లి ప్రతిష్ట పెంచాలనుకుంటున్న మూర్ఖపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. ఆయనవెంట మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, నాయకులు తదితరులున్నారు.

సమయపాలన పాటించని వైద్యురాలు

- డీఎంహెచ్‌వోకు బీజేపీ నాయకుల ఫిర్యాదు



డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

కుకునూరుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలి పనితీరు సరిగా లేదని, సమయపాలన పాటించడం,లేదని డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్‌కు బీజేపీ మండల నాయకులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్‌రెడ్డి, నాయకులు మాట్లాడుతూ కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యురాలు పర్వీన్ ఆస్పత్రికి రోగులు రాకపోయినా వస్తున్నట్లు రికార్డు నమోదు చేస్తున్నారని, రోజుకు 80 నుంచి 100 మంది రోగులను చూస్తున్నట్లు తప్పుడు రికార్డులు సృష్టిస్తున్నారని తెలిపారు. పై విషయాలపై విచారణ చేయాలని వారు కోరారు. కాగా ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ మంజూరు చేయడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్ పాల్గొన్నారు.

చలో అసెంబ్లీ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు



తొగుట: పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

నంగునూరు/తొగుట్ట/మద్దూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో చలో ముట్టడికి పిలుపునివ్వడంతో తొగుట పోలీసులు ముందస్తుగా మండలంలోని మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సర్పంచుల ఫోరం మండల ఉపాధ్యక్షుడు నర్సింహులు, మాజీ సర్పంచులు జ్యోతీమల్లారెడ్డి, రేణుకానర్సింహులు ప్రేమలాచంద్రారెడ్డి, రజిత పాల్గొన్నారు. మద్దూరులో మాజీ సర్పంచులు వంగ భాస్కర్‌రెడ్డి, జీడికంటి సుదర్శన్, వూట్ల రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సుందరగిరి పరశురాములను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నంగునూరులో భిక్షపతినాయక్, రాజేందర్, వంగ కుమార్, వెంకటేశంలను రాజగోపాల్‌పేట పోలీసులు ఉదయమే అదుపులోకి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

'గుంతల రోడ్డుతో ప్రజలకు ఇబ్బందులు'

అక్కన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి నుంచి హుస్నాబాద్‌కు వెళ్లే సింగిల్ రోడ్డు గుంతలు పడడంతో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఐలేని మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గుంతలు పడ్డ గౌరవెల్లి రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మద్దూరు, కుకునూరుపల్లికి 108 అంబులెన్స్‌లు

మద్దూరు/కుకునూరుపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలానికి 108 అంబులెన్స్ వచ్చేసింది. ప్రభుత్వం సిద్దిపేట జిల్లాలోని అంబులెన్స్‌లు లేని 15 మండలాలకుగానూ 15 అంబులెన్స్‌లను కేటాయించినట్లు తెలిసింది. ప్రస్తుతం 7 అంబులెన్స్‌లు మాత్రమే వచ్చాయని, అందులో భాగంగా మద్దూరు మండలానికి 108 అంబులెన్స్ వచ్చింది. అలాగే కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అబులెన్స్ మంజూరైంది. గతంలో 'పీహెచ్‌సీ ఉన్నది... అంబులెన్స్ లేదు' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. స్పందించిన అధికారులు అంబులెన్స్‌ను మంజూరు చేయగా.. అది ఆదివారం రాత్రి ఆస్పత్రికి చేరింది.

'వర్మీ కంపోస్టు వాడకంతో అధిక దిగుబడులు'

అక్కన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు వాడడం వల్ల పంటల్లో అధిక దిగుబడులు వస్తాయని దేశ్ పాండే ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి సంగ శ్రీధర్ సూచించారు. సోమవారం అక్కన్నపేట మండలంలోని గొల్లకుంటలో వర్మీ కంపోస్టు తయారీపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. వర్మీ కంపోస్టు తయారుచేసి భూమిలో చల్లడం ద్వారా తక్కువ పెట్టుబడితో పంటలు అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు.

విద్యార్థులకు సీఐ అభినందన

హుస్నాబాద్‌రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న హన్మకొండలోని కాకతీయ యూనివర్సిటీలో జరిగిన తెలంగాణ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో హుస్నాబాద్ కేరళ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన 212 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 9 మంది గోల్డ్, 8 మంది సిల్వర్ మెడల్, ముగ్గురు విద్యార్థులు బ్రాంజ్ మెడల్ సాధించినట్లు పాఠశాల చైర్మన్ బుర్ర రాజేందర్ తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులన హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ సోమవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీ.రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్ పాల్గొన్నారు.



రాయపోల్‌లో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



గజ్వేల్ పట్టణంలో సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నర్సారెడ్డి



సిద్దిపేటలో కేక్ కట్ చేసి పూజల హరికృష్ణకు కేక్ తినిపిస్తున్న అత్తుఇమామ్

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం సిద్దిపేట జిల్లాలోని ఆయా మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సోనియాగాంధీ తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవించి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని కొనియాడారు.

- న్యూస్ నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి)

సైన్స్‌తోనే మానవ మనుగడ



హుస్నాబాద్ రూరల్: సైన్స్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీవో మనీల



సిద్దిపేట రూరల్: విద్యార్థులను అభినందించి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఈవో రాజిరెడ్డి

హుస్నాబాద్‌రూరల్/సిద్దిపేట రూరల్/చేర్యాల/అక్కన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ ద్వారానే మానవ మనుగడ సాధ్యమౌతుందని ఎంఈవో బీ.మనీల పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో బయోసైన్స్‌పై విద్యార్థులకు టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో కేజీబీవీ విద్యార్థిని ఎస్ రాజశ్రీ(ప్రథమస్థానం), పీ.రుషిత(ద్వితీయస్థానం), తెలుగు మీడియంలో ప్రథమ, ద్వితీయస్థానం సాధించిన టీ.క్రాంతి, ఏ.సాంబరాజుకు బహుమతులు అందజేశారు. సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు మోడల్ స్కూల్ విద్యార్థులు ఆర్.సూర్యతేజ, బీ.వేణు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ తెలిపారు. విద్యార్థులను ఎంఈవో రాజిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. చేర్యాల పట్టణంలోని బాలికల జడ్పీఎస్ఎస్‌లో సోమవారం టీబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బయోసైన్స్ పోటీల్లో ఇంగ్లీష్ మీడియం విభాగంలో ముస్త్యాల జడ్పీఎస్ఎస్ విద్యార్థిని తాటిపల్లి భువనేశ్వర్‌రెడ్డి, తెలుగు విభాగంలో దేవనబోయిన పూజిత ప్రథమ, చేర్యాల-కేజీబీవికి చెందిన కొలిపాక ఝాన్సీ, నాగపురి జడ్పీఎస్ఎస్‌కు చెందిన సాంబాని సంధ్య ద్వితీయస్థానంలో నిలిచారు. వీరికి ఎంఈవో కిష్టయ్య బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీటీఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు ఎం.తిరుపతి, ప్రధాన కార్యదర్శి డీ.బ్రహ్మం, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు. అక్కన్నపేటలోని కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థిని ఎస్.రుచిత, ప్రథమ స్థానం, అంతకపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని వీ.శృతి ద్వితీయస్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ఎంపీడీవో బానోతు జయరాం, ఎంఈవో గుగులోతు రంగా ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందచేశారు.